క్లుప్తంగా

వైద్యనాథుడికి తాత్కాలిక పందిరి ఏర్పాటు



వైద్యనాథుడి వద్ద వేసిన పందిరి

సాక్షి ఎఫెక్ట్...



వైద్యనాథుడికి చేసిన పూజలు

సాలూరు: పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండ సమీపంలో పొలాల్లో ఉన్న స్వయంభూ శివ లింగమైన వైద్యనాథుడికి గూడు, పూజలు లేవని పేర్కొంటూ శివయ్యకు గూడు లేదు.. పూజ లేదు.. శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై స్థానిక గిరిజనులు, భక్తులు స్పందించారు. ఈ మేరకు పొలాల్లో ఉన్న వైద్యనాథుడు, నంది తదితర విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం కొబ్బరి కొమ్మలు, పందిరి రాటలతో తాత్కాలికంగా పందిరి వేశారు.

ఈవీఎం గొడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గొడౌన్ వద్ద కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: స్థానిక మార్కెట్ యార్డులోని ఈవీఎంల గొడౌన్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు నిక్షిప్తంగా భద్రపరిచే గొడౌన్‌ను పీరియాడిక్ తనిఖీల్లో భాగంగా భద్రత, గొడౌన్‌కు వేసిన సీల్స్‌ను నిశితంగా పరిశీలించారు. ఈవీఎం గొడౌన్ వద్ద భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.హేమలత, కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి జయ, తదితరులు పాల్గొన్నారు.

కాశీపట్నంలో చురుగ్గా పారిశుధ్య పనులు



కాలువల్లో పూడికలు తీస్తున్న పారిశుధ్య కార్మికులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీలో మూడు రోజులుగా సర్పంచ్ ఎస్.సుందర్ రావు పర్యవేక్షణలో చురుగ్గా పారిశుధ్య పనులు జరిపిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గల కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తీయించారు. సేకరించిన చెత్తను గ్రామ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ జరిపించారు. పంచాయతీ ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు జరిపిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు మాజీ సర్పంచ్ కోట్ల నారాయణరావు పాల్గొన్నారు.

విజయగౌరి తరఫున యూటీఎఫ్ ప్రచారం





విజయగౌరికి ఓటువేసి గెలిపించాలని కోరుతున్న యూటీఎఫ్ నాయకులు

సాలూరు: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు సత్యంనాయుడు, చంద్రినాయుడు తదితరులు ఉపాధ్యాయులను కోరారు.ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలోని గాడివీధి హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్, జూనియర్ కళాశాల తదితర విద్యాలయాల్లో విజయగౌరికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..!

- జాగరణకు ముస్తాబైన శైవక్షేత్రాలు





పారమ్మకొండ

సాలూరు: మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో శైవక్షేత్రాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. సాలూరు పట్టణంలోని పంచముఖేశ్వరస్వామి తదితర శివాలయాలు, సాలూరు, పాచిపెంట మండలాల్లోని శివాలయాలు, ప్రసిద్ధ క్షేత్రాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి.



మంచాడవలస గుహలో ఉన్న శివలింగం, నంది, వినాయక విగ్రహాలు



కురుకూటిలో మర్రిచెట్టు తొర్రలో ఉన్న శివలింగం



కాకుడువలస కొండపై ఉన్న శివలింగం

సాలూరు మండలంలోని కురుకూటి, మరిపల్లి పంచాయతీ కాకుడువలస, తోణాం గ్రామాల్లో వెలసిన మూడు స్వయంభూ లింగాలు, శివరాంపురం, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో శివాలయాలు, పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలోని పారమ్మ కొండ, మంచాడవలసలోని గోకర్ణేశ్వరస్వామి, పాచిపెంట మండల కేంద్రంలో మల్లికార్జునస్వామి, కర్రివలస శివాలయం తదితర శైవక్షేత్రాల్లో మహాశివుడు అశేష భక్తజనంతో శివరాత్రి పూజలను అందుకోనున్నాడు.

2,400 సంవత్సరాల పారమ్మకొండ చరిత్ర

సుమారు కి.మీ. ఎత్తు ఉన్నట్లు భావించే శివలింగాకారంలో ఉండే పారమ్మ కొండపై 36 చేతులతో ఆయుధాలు ధరించి శిరస్సుపై శివుడిని కలిగి ప్రత్యేకంగా ఉండే అమ్మవారి విగ్రహాన్ని మొదటగా దేవతలు ప్రతిష్ఠించారని భక్తులు చెబుతుంటారు. ఈ విగ్రహాన్ని సుమారు 2,400 సంవత్సరాల క్రితమే ప్రతిష్ఠించారని భక్తుల వాదన. ఇక్కడి గుహలోనే పాండవులు వనవాసం ఉండేవారని, దీనికి ప్రతీకగా పాండవుల గుహ ఉందని చెబుతున్నారు. పారమ్మతల్లి చరిత్ర గురించి జైనులకు సంబంధించి పురాతన గ్రంథాల్లోనూ రాశారని భక్తుల వాదన. మొదటగా పారమ్మతల్లికి పూజలు చేసింది ఈ ప్రాంత గిరిజనులే. అమ్మవారి మూర్తిలోని నందిని మాతకు తార్కాణంగా భావించి గిరిజనులు ఈ మూర్తిని శివపార్వతుల మూర్తిగా భావించారు. పార్వతిదేవి వాడుకలో పారమ్మగా మారిపోయింది. తమ కోర్కెలను తీర్చుతున్న కొండపై వెలసిన పారమ్మతల్లిపై విశ్వాసం పెరగడంతో అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వస్తుంది. అమ్మవారి రూపం ఒక్కో సమయంలో ఒక్కోలా ఉంటుందని భక్తులు విశ్వసిస్తుంటారు. కొండపైకి ఎక్కలేని భక్తుల కోసం కొండ కింద అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

పారమ్మకొండ జాతరకు 25 ఆర్టీసీ బస్సులు

పారమ్మకొండ జాతరకు బస్సుల సౌకర్యార్థం సాలూరు ఆర్టీసీ డిపో నుంచి 25 బస్సులు వేసినట్లు ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సాలూరు నుంచి పారమ్మకొండకు టికెట్ ధర 20 రుపాయలుగా నిర్ధారించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఏఎంఓ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఓ శ్రీనివాసరావు

బలిజిపేట: అంగన్వాడీ కార్యకర్తలకు 6రోజుల పాటు ఇచ్చిన జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో పొందిన అనుభవంతో మంచి కేంద్రాలను తయారుచేయాలని ఏఎంఓ బి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో 6రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం పూర్తయింది. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాలను ఆయన పర్యవేక్షించి వారికి తగిన సూచనలు అందజేశారు. గతంలో లేనివిధంగా చిన్నారులకు ఏ విధంగా విద్యను అందించాలనేది శిక్షణ రూపంలో పొందిన అనుభవాన్ని వినియోగించాలని సూచించారు. పాఠశాల విద్యకు అనుగుణంగా అంగన్వాడీ కేంద్రాల విద్యను రూపొందించినందున ఇటువంటి శిక్షణ అవసరమని గ్రహించి ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు వారి స్థాయిలో ఇదేవిధంగా శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. అందువల్ల ప్రతి అంగన్వాడీ కార్యకర్త దీనిని ఒక చాలెంజింగ్‌గా తీసుకుని చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్పీలు కె.రమేష్‌బాబు, జి.రామారావు, ఎస్.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వర్షాధార భూముల్లో ఫారం పాండ్స్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో గల వర్షాధార భూముల్లో అత్యవసర పరిస్థితుల్లో పంటకు తడులు అందించడానికి ఫారంపాండ్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని వెంకటాపురం పంచాయతీలో వర్షాధారం భూముల్లో నిర్మాణాలు జరుగుతున్న ఫారంపాండ్స్ పనులు, వేతనదారుల హాజరును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో కురుస్తున్న వర్షపు నీరు నిల్వ ఉంచి అత్యవసర పరిస్థితుల్లో పంటలకు తడులు అందించడానికి, నేలలో నీటి మట్టం పెరగడానికి దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలో ప్రతిగ్రామానికి చెందిన వర్షాధార భూముల్లో ఫారంపాండ్స్ నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు ఇచ్చామన్నారు. జాబ్‌కార్డులున్న రైతులు, సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

శిక్షణపై అవగాహన కల్పించుకోవాలి



స్టాల్స్ వద్ద మాట్లాడుతున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారుల్లో సులభతరంగా జ్ఞానజ్యోతి ద్వారా విద్యాబోధన నిర్వహించడానికి శిక్షణ తరగతుల్లో అంగన్వాడీ టీచర్స్ అవగాహన కల్పించుకోవాలని ఎంఈఓలు జి. సూరిదేముడు, ఎం.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు జోగింపేట కేజీబీవీలో రెండవ విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో వారు సోమవారం పాల్గొన్నారు. ఈనెల 22 నుంచి 25 వరకు ట్రైనింగ్‌లో భాగంగా రెండవ స్పెల్‌లో రెండవరోజు కార్యక్రమాన్ని ప్రార్థన గీతంతో ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా పాఠశాల సంసిద్ధతా మేళా నిర్వహించామని చెప్పారు. పాఠశాల సంసిద్ధతా మేళాలో శారీరకాభివృద్ధి, మేధాభివృద్ధి, భాషాభివృద్ధి, పూర్వ గణితాభివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధి తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ల పర్యవేక్షణలో స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అంగన్‌వాడీ నుంచి పిల్లలు పాఠశాలలో చేరేటప్పుడు ఆ పాఠశాలలో సంసిద్ధతా మేళా నిర్వహించి విద్యార్థి స్థాయిని గుర్తించి విద్యార్థికి గ్రేడింగ్ ఇచ్చి అసైన్‌మెంట్ చేయడం కోసం ఈ మేళాను నిర్వహిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కూర్మినాయుడు, సీహెచ్ గణపతి, ఎస్ రవికుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త కనిపించరాదు

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా ఆరుబయట చెత్త కనిపించరాదని, ఆ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ పార్వతీపురంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుబయట చెత్త కనిపించకుండా అందేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ సహకారం తీసుకోవాలని చెప్పారు. ప్రతి మున్సిపాల్టీ, పరిసర పంచాయతీ నుంచి ఇద్దరు ఆసక్తిగల యువకులను ఎంపిక చేయాలని సూచించారు. ఇందుకు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన యువతకు మార్చి 1వ తేదీ నుంచి పారిశుధ్యంపై శిక్షణ నిర్వహిస్తామని, ఈ శిక్షణకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా రాబోయే ఆరుమాసాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన నిధుల వివరాలను స్వచ్ఛంధ్ర కార్పొరేషన్‌కు పంపించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో చెత్త ఆరుబయట కనిపించకుండా చర్యలు చేపట్టి చెత్త నుంచి సంపదను సృష్టించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జట్టు ఆశ్రమం సభ్యులు వి. పద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు, డీఎల్డీలు రమేష్ రామన్, వీవీ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారమ్మతల్లి సాక్షిగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పారమ్మకొండకు వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన మంత్రి సంధ్యారాణి ఫొటోతో కూడిన ఫ్లెక్సీ

సాలూరు: పారమ్మ కొండ వద్ద ఉన్న పారమ్మతల్లి సాక్షిగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కాగా పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండ వద్ద మహాశివరాత్రి అంగరంగవైభవంగా ప్రతి ఏడాది జరుగుతుంది.ఈ క్రమంలో ఇక్కడ స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఫ్లెక్సీలను ఏర్పాటుచేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇవి పెట్టకూడదు కదా అని ప్రజలు మాట్లాడుకుంటూ, దీనిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని చర్చించుకుంటున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లనే ఈ విధంగా యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుందంటూ పలువురు ప్రజలు ఈ ఫ్లెక్సీలు చూస్తూ ముందుకు కదలడం కనిపించింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.50 వేల జరిమానా

పార్వతీపురం రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపినందుకుగాను ఐదుగురు వ్యక్తులకు రూ.50 వేల జరిమానా విధించినట్లు పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా చొప్పున మొత్తం ఐదుగురు వ్యక్తులకు కలిపి రూ.50 వేల జరిమానా మంగళవారం విధించారని. రెండోసారి మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే మూడు నెలల జైలు శిక్ష విధించనున్నట్లు పార్వతీపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హెచ్చరించినట్లు సీఐ తెలిపారు.

జీడిపరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: పార్వతీపురం మార్కెట్ యార్డ్ సమీపంలో జీడిపరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో జీడి పరిశ్రమ ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జీడిపరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సొసైటీ రిజిస్ట్రేషన్, ఉద్యమ్ ఆధార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవీకరణ, వసతులను ఏర్పాటుచేయాలని చెప్పారు. వీడీవీకేలు ఏడాదిపాటు పనిచేసేలా వెలుగు సిబ్బందితో ప్రణాళికలు చేయాలని సూచించారు. గిరిజన ఉత్పత్తులు చింతపండు, జీడి కొనుగోలు చేసేలా లక్ష్యాలను విధించాలన్నారు. జీడిపప్పు తయారీ కేంద్రంలో జీడిపిక్కలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవి.కరుణాకర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ బి.కరుణ, జీసీసీ డీఎం మహేంద్రకుమార్, వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ వివిధ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్లు



ఇప్పలవలస సమీపంలో మలుపులో కోతకు గురైన బీటీ రోడ్డు



కాలువ వద్ద ప్రమాదకరంగా బీటీ రోడ్డు

సీతానగరం: మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జోగింపేట–ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల మధ్య బీటీ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని పలుగ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వివిధ రకాల పనుల నిమిత్తం నిరంతరం జగన్నాథపురం, నిడగల్లు, పాపమ్మవలస, నీలకంఠాపురం, ఇప్పలవలస గ్రామాలనుంచి మండలకేంద్రానికి ద్విచక్రవాహనాలతో రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఇదే రహదారి కావడం, రోడ్డు గోతులమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రోడ్డు కోతకు గురవడం, గోతులు ఏర్పడడం వల్ల వాహనం మీద వచ్చే సమయంలో ఆదమరిస్తే ప్రమాదాలకు బారిన పడాల్సి వస్తుందని అంటున్నారు. సంక్రాంతికి బీటీ రోడ్లపై ఉన్న గోతులన్నీ కప్పేస్తామని ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదని సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించడంతో..అభివృద్ధి పనులు చేస్తారని ఆశించామని, కానీ ముఖ్యమంత్రి మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతరాయుడుపేట -ఏగోటివలస, అనంతరాయుడుపేట రంగంపేట, రంగంపేట- కేఎస్ పురం జంక్షన్ వరకూ రోడ్లు అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయాగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఊకలారీ



ప్రధాన రహదారిపై నుంచి వెళ్తున్న ఊకలారీ

బలిజిపేట: జనసంచారం ఉండే సమయాల్లో ఊక లారీలు ప్రధాన రహదారిపై వెళ్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాధారణంగా ఇటువంటి ఊకలారీలు అర్ధరాత్రి సమయంలో తీసుకువెళ్లాల్సి ఉండగా రాత్రి 8గంటల లోపే తరలిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. లారీలకు విపరీతంగా ఊకను ఎక్కించి రెండు పక్కలా వెనుక భాగంలో పరదాలు కట్టి నింపడంతో అవి రహదారులపైకి వచ్చేటప్పుడు రోడ్డును పూర్తిగా ఆక్రమించడమే కాకుండా అటువైపు, ఇటువైపు ఎవరూ వచ్చిపోవడానికి వీలులేకుండా ప్రమాదకరంగా ఉంటున్నాయని, చీకటి ప్రాంతంలో కనిపించక వాటిని ఢీకొడితే ప్రాణాలపై ఆశలు వదులుకోవలసి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి లారీలను అర్ధరాత్రి సమయాల్లో మాత్రమే రవాణా చేసేందుకు పోలీసులు అనుమతించాలి తప్ప జనసంచారం ఉండే సమయాల్లో ఈ విధంగా లారీలు వెళ్లడాన్ని నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు





పోలమాంబ అమ్మవారు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మొక్కుబడి చెల్లిస్తున్న పాచిపెంట ఎంపీపీ ప్రమీల

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి అయిదవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురు గుడి ఆలయం వద్ద క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటరమణ దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. గోముఖి నదీతీరాన భక్తులు అమ్మవారికి కోళ్ల మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం వనంగుడిలోని పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆలయం వెనుకన గల వేపచెట్టుకు పూజలు చేశారు.

మమ అనిపించి.. ముగించేశారు..!

- 13 అర్జీలతో వెలవెలబోయిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక



విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

సాలూరు: విద్యుత్ సమస్యలతో గగ్గోలు పెట్టిన నియోజకవర్గంలో అధికారులు నిర్వహించిన విద్యుత్‌సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కేవలం 13 అర్జీలు రావడం చూస్తుంటే ఈ కార్యక్రమం ఎంతవరకు విజయవంతమైందో చెప్పకనే చెప్పవచ్చు. సాలూరు పట్టణంలో ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం గురించి విద్యుత్ శాఖ అధికారులు పలు పేపర్లలో తూతూమంత్రంగా ప్రకటన ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్న విషయం ప్రజల్లోకి వెళ్లని పరిస్థితి కనిపించింది.

వారం రోజుల ముందుగానే ఈ కార్యక్రమం గురించి అధికారులకు తెలిసినప్పుడు, నియోజకవర్గంలో అధికంగా గిరిజనులు ఉన్న నేపథ్యంలో వారికి తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించడం లేదా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా క్షేత్రస్థాయిలో సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి నియోజకవర్గంలోని సాలూరు మున్సిపాలిటీ బంగారమ్మపేటలో పలువురు ఎస్సీలకు విద్యుత్‌బకాయిలు ఉన్నాయని మీటర్లకు విద్యుత్ కనెక్షన్‌లు తొలగించడం, గిరిశిఖర గ్రామాల్లో ఎస్టీలకు అధిక విద్యుత్ బిల్లులు రావడం తదితర అనేక విద్యుత్ సమస్యలు ఉన్నాయి. ఇన్ని సమస్యలు నియోజకవర్గంలో ఉండగా కేవలం 13 అర్జీలు మాత్రమే వచ్చాయని అధికారులు చెబుతుండడం చూస్తుంటే ఈ కార్యక్రమం నిర్వహణ పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి స్పష్టంగా అర్థమవుతోందని, తూతూమంత్రంగా కార్యక్రమం నిర్వహించి ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు తప్ప ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ఎందుకంటూ పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు హాజరైన ఈ కార్యక్రమంలో అధిక అర్జీలు వస్తే ఆ సమస్యల పరిష్కార భారం తమమీదనే మళ్లీ పడుతుందని భావించే స్థానిక ఎలక్ట్రికల్ అధికారులు ఈ విధంగా మమ అనిపించి కార్యక్రమం ముగించేశారని పలువురు ఆరోపిస్తుండడం గమనార్హం.